రాజస్థాన్ రాష్ట్రం

వర్సెస్

రామ్ నారాయణ్ మరియు ఇతరులు.

జనవరి 23, 1996

[K. రామస్వామి, S. సగీర్ అహ్మద్ మరియు

G.B.పట్టనాయక్, న్యాయమూర్తులు]

*శిక్షాస్మృతి. 1860:*

*సెక్షన్లు 342, 361, 366, 376 – మైనర్ అమ్మాయి – అక్రమ నిర్బంధం మరియు అత్యాచారం – విచారణ – ముగ్గురు నిందితులు దోషిగా నిర్ధారించబడి, శిక్ష విధించబడ్డారు – ఉన్నత న్యాయస్థానం వారి శిక్షను అనుభవించిన కాలానికి తగ్గించింది – అప్పీలు చేసినప్పుడు, బాధితురాలు మైనర్ అయితే, సమ్మతి ప్రశ్న తలెత్తదు – మొదటి నిందితుడి అత్యాచారం నిరూపించబడింది – బాధితురాలు మొదటి నిందితుడి ద్వారా మాత్రమే అత్యాచారానికి పాల్పడబడిందని ఆరోపించినట్లుగా నిందితుడిని తప్పుగా ఇరికించలేదు – ఉన్నత న్యాయస్థానం తీర్పు త్రోసిపుచ్చబడినది – మొదటి నిందితుడి నేరనిర్ధారణ సమర్థించబడింది – సెక్షన్ 376 కింద ఐదు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, మరియు జరిమానా రూ.2,000 ను బాధితురాలికి చెల్లించాలి – ముగ్గురు నిందితులకు సెక్షన్ 366 కింద ఐదేళ్ల జైలు శిక్ష మరియు సెక్షన్ 342 కింద ఒక సంవత్సరం జైలు శిక్ష విధించబడినది.*

క్రిమినల్ అప్పీలు అధికార పరిధి: క్రిమినల్ అప్పీలు నెం.189/1996.

S.B. క్రిమినల్ అప్పీలు నెం.351/1984 యందు రాజస్థాన్ హైకోర్టు తేదీ 18.12.91 నాడు ఇచ్చిన తీర్పు మరియు ఉత్తర్వు నుండి.

K.S. భాటి, అప్పీలుదారు తరపున.

సుశీల్ కుమార్ జైన్, ప్రతివాది తరపున.

కోర్టు యొక్క ఈ క్రింది ఉత్తర్వు జారీ చేయడమైనది:

అనుమతి మంజూరు చేయబడింది.

ఇరు వైపులా న్యాయవాది వాదనలు వినడమైనది.

ప్రతివాదుల సంఖ్య 2 మరియు 3 కు సంబంధించి భారతీయ శిక్షాస్మృతి లోని 366 మరియు 342 సెక్షన్ల కింద, రామ్ నారాయణ్ కు సంబంధించి భారతీయ శిక్షాస్మృతి (సంక్షిప్తంగా "IPC") లోని సెక్షన్లు 376, 366 మరియు 342 కింద నేరాలకు, ప్రతివాదులు రామ్ నారాయణ్, బజరంగ్ లాల్ మరియు మంజా రామ్ అనే ముగ్గురు ప్రతివాదుల నేర నిర్ధారణను ధృవీకరిస్తూ, వారి శిక్షను ఇప్పటికే అనుభవించిన కాలానికి అంటే ఒకటిన్నర నెలలకు తగ్గించడం చాలా విచిత్రంగా ఉంది. హైకోర్టు శిక్షను తగ్గించడంపై ఈ కోర్టు నోటీసు జారీ చేసింది.

వాస్తవాలు ఏమిటంటే, 1983 ఆగస్టు 14న 15 నుండి 17 సంవత్సరాల మధ్య వయస్సు గల బాధితురాలు అనూప్ దేవి తన మామయ్య ఇంటి నుండి తన తల్లిదండ్రుల ఇల్లు వద్దకు వస్తుండగా, గ్రామ శివార్లలో సర్కస్ కు వెళ్లడానికి మహిళలందరూ సమావేశమయ్యారని నమ్మమని ఈ నిందితులు ఆమెను ప్రలోభపెట్టారు. అమాయకంగా వారి మాటలు నమ్మిన ఆమె వారితో కలిసి శివార్లకు వెళ్లినా అక్కడ మహిళలు కనిపించలేదు. ఆమెకు కత్తి చూపి సిరోహ్ అనే మరో గ్రామానికి, అక్కడి నుండి ట్రక్కులో జైపూర్ కు తీసుకెళ్లారు. జైపూర్ లో ఆమెను అన్యాయంగా ఓ ఇంట్లో బంధించారు. జైపూర్ నుంచి ఆమెను మూర్తిపురాకు తీసుకెళ్లి అక్కడ మొదటి నిందితుడు – ప్రతివాది ఆమెపై లైంగిక దాడి చేశాడు. ఆమెను అన్యాయంగా ఆ ఇంట్లో బంధించారు. అక్కడి నుంచి ఆమెను స్వగ్రామానికి తీసుకువచ్చి మొదటి నిందితుడి ఇంట్లో బంధించారు. ఈ విషయం తెలుసుకున్న బాధితురాలి తండ్రి (PW 3) పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు ఆమెను మొదటి నిందితుడి ఇంటి నుండి స్వాధీనం చేసుకున్నారు.

విచారణలో, ఐదుగురు సాక్షులను, అనగా, బాధితురాలు [PW 1], ఆమె తల్లి మరియు తండ్రి (PW 2 మరియు PW 3) మరియు పొరుగు వారి(PW 4 మరియు PW 5)ని విచారించారు. PW1, బాధితురాలు, ఆమె తల్లి మరియు తండ్రి (PW2 మరియు PW3) మరియు ఇరుగు పొరుగు వారి (PW 4 మరియు PW 5) సాక్ష్యాలను విశ్వసించిన సెషన్స్ జడ్జి మొదటి నిందితుడిని భారతీయ శిక్షాస్మృతి లోని సెక్షన్ 376, 366 మరియు 342 కింద దోషిగా నిర్ధారించి మొదటి నిందితుడికి వరుసగా ఏడేళ్లు, ఐదేళ్లు, ఏడాది జైలు శిక్ష విధించారు మరియు సమానంగా రూ.200 జరిమానా విధించారు. అదేవిధంగా, రెండవ మరియు మూడవ నిందితులను భారతీయ శిక్షాస్మృతిలోని 366 మరియు 342 సెక్షన్ల కింద దోషులుగా నిర్ధారించి, వరుసగా ఐదు సంవత్సరాలు మరియు ఒక సంవత్సరం జైలు శిక్ష విధించారు. శిక్షలన్నీ ఏకకాలంలో అమలు చేయాలని ఆదేశించారు.

నిందితులు–ప్రతివాదులు ఈ విషయాన్ని అప్పీలుకు తీసుకెళ్లారు మరియు ప్రాసిక్యూషన్ తన కేసును ఎటువంటి సందేహాలకు తావులేకుండా నిర్ధారించిందని నిరూపించడానికి రికార్డులో ఉన్న సాక్ష్యాలు సరిపోతాయని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. అయితే, ఆయన శిక్షను తగ్గించి, అప్పీలును అనుమతించారు. మొదటి నిందితుడి వయస్సు 18 సంవత్సరాలు, మరియు అతను ఇప్పటికే అనుభవించిన ఒకటిన్నర నెలల శిక్ష, న్యాయ ఉద్దేశ్యాలను చేరుకోవడానికి సరిపోతుందని ఆయన గమనించారు. తదనుగుణంగా, శిక్షను వారు ఇప్పటికే అనుభవించిన కాలానికి తగ్గించినట్లయితే న్యాయం జరుగుతుందని గౌరవ న్యాయమూర్తి తెలియజేశారు.

బాధితురాలి సాక్ష్యాలను పరిశీలించిన హైకోర్టు శిక్షను తగ్గించడం సమంజసమేనని ప్రతివాదుల తరపు న్యాయవాది సుశీల్ కుమార్ జైన్ వాదించారు. ఆమె సమ్మతము తెలిపే పక్షము మరియు స్వతంత్ర ధృవీకరణ లేకుండా, ఆమె సాక్ష్యము అనుమానాస్పదంగా ఉంటుంది మరియు దానిపై ఆధారపడలేము. ఈ నేరం ఏప్రిల్ 14, 1983 న జరిగింది మరియు బాధితురాలి తండ్రి మే 13, 1983 న, అంటే సంఘటన జరిగిన ఒక నెల తరువాత నివేదికను దాఖలు చేశారు. ఆమె సమ్మతించిన పక్షం కాకపోయి ఉంటే, అపహరణ జరిగిన వెంటనే నివేదిక దాఖలు అయ్యే అవకాశం లేదు. PW3 కుమార్తెను మొదటి నిందితుడి సహవాసంలో ఒక నెల పాటు ఉండటానికి అనుమతించడం మరియు తల్లిదండ్రులు ఎటువంటి చర్య తీసుకోకపోవడం, ఈ ప్రవర్తన ప్రాసిక్యూషనుకు వ్యతిరేకంగా సూచిస్తుంది మరియు ప్రతివాదులకి ఎటువంటి నేరం చేయాలనే ఉద్దేశ్యం లేదని మరియు బాధితురాలు (PW 1) సమ్మతి పక్షం అని సూచిస్తుంది. ఆమె 15 నుండి 17 సంవత్సరాల మధ్య వయస్సు గల మైనర్ అని డాక్టర్ [PW 5] సాక్ష్యము నుండి నిరూపించబడిన బాధితురాలి వైఖరిని మేము విశ్లేషించడంలో విఫలమవుతున్నాము. ఆమె ఒక అమాయక గ్రామ అమ్మాయి. ఆమె సాక్ష్యం నుండి మనకు అంతర్గత సత్యం దొరుకుతుంది, ఆమె నిజమైన సాక్షిగా ఉంటుంది. ఆమె సాక్ష్యముకు ఎటువంటి ధృవీకరణ అవసరం లేదు. ప్రాసిక్యూషన్ యొక్క సాక్ష్యం ఆమోదానికి విశ్వాసాన్ని ప్రేరేపిస్తుందా అని ప్రతి కేసులో కోర్టు పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ప్రతి కేసును దాని స్వంత నేపథ్యం, వాస్తవాలు మరియు సందర్భాలలో పరిగణించాలి. వాస్తవానికి, PW 1 కి నిందితులందరినీ తప్పుగా ఇరికించాలనే ఉద్దేశం ఉండి ఉంటే, రెండవ మరియు మూడవ నిందితుడు కూడా ఆమెతో లైంగిక సంబంధం పెట్టుకున్నాడని చెప్పడానికి ఏదీ ఆమెను నిరోధించలేదు. ఆమె లైంగిక సంపర్క చర్యను మొదటి నిందితుడికి మాత్రమే ఆపాదించినప్పుడు మరియు మరెవరికీ ఆపాదించనప్పుడు గౌరవ సెషన్స్ జడ్జి ఆమె స్పష్టతతో చాలా ప్రభావితుడయ్యాడు. మహిళలతో పాటు సర్కస్ కు వెళ్ళుటకు ఆమెను ప్రేరేపించినప్పుడు, ఆమె గ్రామ శివార్లకు వచ్చింది, ఆమెకు ఎవరూ కనిపించకపోవడంతో,

ఆమె గొంతు మీద కత్తి చూపించి భయపెట్టి, గ్రామ శివార్ల నుండి ముగ్గురు నిందితులు ఆమెను వివిధ ప్రదేశాలకు తీసుకెళ్లారు. ఒక అమాయక అమ్మాయి తనను ఒక చోట నుండి మరొక చోటికి తీసుకెళ్లిన ముగ్గురు వ్యక్తులను ప్రతిఘటించడం కష్టం మరియు ఆమె వారి బారి నుండి తప్పించుకోవడానికి ప్రయత్నించకపోగా ఎవరికీ ఎటువంటి నివేదిక ఇవ్వలేకపోయింది. సహజంగానే, పరిస్థితులలో ఆమె తనను తాను రాజీ చేసుకుని, తన విధికి లొంగిపోయి, ఒక నెల కంటే ఎక్కువ కాలం వారి అక్రమ ఆధీనంలో ఉండిపోయింది. ఆమెను అక్రమంగా వేర్వేరు చోట్ల నిర్బంధించారని ఆమె సాక్ష్యాధారాలు స్పష్టం చేస్తున్నాయి. ఆమెను స్వస్థలానికి తీసుకువచ్చిన తర్వాత కూడా ఆమెను మొదటి నిందితుడి ఇంట్లో అక్రమంగా నిర్బంధించారు. ఈ విధంగా సాక్ష్యాలు 364, 361 సెక్షన్ల కింద నేరమును మరియు సెక్షన్ 342 కింద అక్రమ నిర్బంధం యొక్క నేరాన్ని తెలియజేస్తున్నాయి. సెక్షన్ 376 ప్రకారం నేరానికి సంబంధించి ఆమె సాక్ష్యం సరిపోతుంది. అంతేకాకుండా, వైద్య సాక్ష్యాలు మరియు పరిస్థితుల దృష్ట్యా సాక్ష్యాల నుండి కూడా మాకు ధృవీకరణ లభిస్తుంది, అంటే మొదటి నిందితుడి లోదుస్తులు మరియు బాధితురాలి పెటికోట్ మొదటి నిందితుడు బాధితురాలితో లైంగిక సంపర్కాన్ని రుజువు చేస్తాయి. బాధితురాలు మైనర్ కావడంతో, ఆమె సమ్మతి విషయము తలెత్తదు, అందువల్ల, ఆమె సమ్మతించే పక్షం అని శ్రీ సుశీల్ కుమార్ జైన్ వాదన బేషరతుగా నమ్మదగనిది మరియు ఆమోదయోగ్యం కాదు. సహజంగానే, ఈ పరిస్థితులలో, ఆమె తనను తాను మరియు తన విధిని రాజీ చేసుకుంది మరియు మొదటి నిందితుడు లైంగిక సంపర్కం కలిగి ఉన్నాడు మరియు భారతీయ శిక్షాస్మృతి లోని సెక్షన్ 376 కింద నేరం నిరూపించబడింది.

విషయము ఏమిటంటేః శిక్షను ఇప్పటికే అనుభవించిన కాలానికి, అంటే ఒకటిన్నర నెలకు తగ్గించడంలో హైకోర్టు సరైనదేనా? మేము శిక్షను తగ్గించడంలో హైకోర్టు చట్టప్రకారం తీవ్రమైన పొరపాటు చేసిందని భావిస్తున్నాము. అందువల్ల, హైకోర్టు తీర్పు త్రోసిపుచబడింది. మొదటి నిందితుడి శిక్షను సమర్థిస్తూ అతనికి సెక్షన్ 376 కింద 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించబడినది. అదేవిధంగా, ముగ్గురు నిందితులను భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 366 కింద దోషులుగా నిర్ధారించి ఐదేళ్ల జైలు శిక్ష మరియు భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 342 కింద ఒక సంవత్సరం జైలు శిక్ష విధించబడినది. అదనంగా మొదటి నిందితుడికి రూ.2,000 మరియు అదే చెల్లించినట్లయితే, అది మైనర్ బాధితురాలికి చెల్లించాలని నిర్దేశించబడినది. చెల్లించని యెడల, అతను 3 నెలల కఠినమైన జైలు శిక్ష అనుభవించాలి. రెండవ మరియు మూడవ ప్రతివాది – నిందితులు సెక్షన్ 366 కింద నేర నిర్ధారణకు అదనంగా ఒక్కొక్కరిని రూ.1,000 జరిమానా చెల్లించాలని ఆదేశించడమైనది. చెల్లించని యెడల, వారు ఒక నెల కఠినమైన జైలు శిక్ష అనుభవించాలి. అన్ని శిక్షలు ఏకకాలంలో

అమలు అవుతాయి. జరిమానా చెల్లించినట్లయితే, దానిని బాధితురాలికి చెల్లించాలని నిర్దేశించడమైనది.

తదనుగుణంగా అప్పీలు అనుమతించబడినది.

అప్పీలు అనుమతించబడింది.

అనువదించినవారు: ARK.

అనువదించిన పేజీల సంఖ్య – 4.